క్లుప్తంగా

సబ్‌కలెక్టర్‌ను కలసిన తహసీల్దార్



సబ్‌కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న తహసీల్దార్ రమేష్

ఆదోని రూరల్: ఆదోని నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎంఏ రమేష్ ఆదివారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను కలిశారు. పూలమొక్కను అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూపరమైన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్‌కు సూచించారు.

మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితో ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగప్ప

ఆదోని రూరల్: ఆదోని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగప్ప ఆదివారం ఆదోని పట్టణంలో వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. 2029 ఎన్నికల్లో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగానూ, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గెలుపుకు తనవంతు కృషి చేస్తానని నాగప్ప తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీళ్లట్యాంకు శుభ్రం



ట్యాంకును శుభ్రం చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళానికి తాగు నీరు అందించే రక్షిత నీటి పథకం రాజనగర్ ఎస్ఎస్ ట్యాంకు వద్ద ఫిల్టర్‌బెడ్లు, నీటి స్టోరేజ్ సంపులను శుభ్రం చేసినట్లు సర్పంచ్ పాల్‌దినకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య తెలిపారు. ట్యాంకు శుభ్రంతో పాటు సంపులోని పూడిక తీయడం జరిగిందని, కావున సోమవారం ప్రజలు ఏవరూ పైపుల నుంచే వచ్చే తాగునీటిని పట్టుకోరాదని సూచించారు. అలాగే రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం కల్గుతుందని ప్రజలు సహకరించాలన్నారు. గ్రామంలో ఫీల్టర్‌తో కూడుకున్న నీరు సరఫరా చేయాలన్న కారణంగా ట్యాంకులను శుభ్రం చేసినట్లు వెల్లడించారు.

ఘనంగా సీపీఐ మహాసభలు



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు

ఆదోని రూరల్: మండలంలోని కొత్తూరు గ్రామంలో ఆదివారం గ్రామశాఖ సీపీఐ మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు కొత్తూరు గంగన్న జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు, ఏపీ రైతుసంఘం మండల కార్యదర్శి యల్లప్ప మాట్లాడుతూ భారత గడ్డపై 100 సంవత్సరాలుగా ప్రజల పక్షాన సీపీఐ పోరాటాలు చేస్తోందన్నారు. పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా కొతూత్రు గంగన్న, సహాయ కార్యదర్శిగా మాజీ సర్పంచ్ హనుమంత, మునియప్ప, ఈరన్న, పెద్ద తాయప్పతో పాటు మరో 9 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సూర్య ఘర్ యోజనను సద్వినియోగం చేసుకోండి



సూర్యఘర్ గురించి ప్రచారం నిర్వహిస్తున్న ఏఈ, సిబ్బంది

కౌతాళం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ సోలార్ సబ్సిడీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ నర్సన్న సూచించారు. ఆదివారం కౌతాళంలో ఈ పథకంపై ర్యాలీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ పథకం కోసం అర్హులైన వారందరు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గృహ, కమర్షియల్ వినియోగదారులు కూడా సోలర్‌ను వేసుకోవచ్చన్నారు. ఈ పథకానికి అయ్యే ఖర్చు కోసం బ్యాంకు లోన్ కూడా ఇస్తుందని, ఈఎంఐ సదుపాయంతో చెల్లించవచ్చని తెలిపారు. ఆసక్తి కల్గిన వారందరూ సూర్యఘర్ సొలర్ సబ్సిడీ పథకంలో చేరవచ్చన్నారు.

వేతన.. వేదన!

- పెండింగ్‌లో రూ.2.44 కోట్ల ఉపాధి కూలీల వేతనాలు
- రెండున్నర నెలలుగా అందని వైనం
- వేతనాలు రాకపోవడంతో పనులకు దూరంగా కూలీలు
- తగ్గిన గ్రాఫ్



నందవరంలో కాలువ పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

నందవరం : వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలకు ఉపాధి పనులే శరణ్యం. పూట గడిచేందుకు కూలీలు ఉపాధి పనులను ఆశ్రయిస్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వం కూలీల ఆశలపై నీళ్లు చల్లుతోంది. నెలల తరబడి వేతనాలు పెండింగ్ పెట్టి పేదల కంట కన్నీళ్లు పెట్టిస్తోంది. పూట గడిచేందుకు నానా యాతన పడాల్సి వస్తోంది. వారాల తరబడి వేతనాలు ఇవ్వక పోడంతో కూలీలు సైతం పనులపై ఆసక్తి చూపడం లేదు. పనులకు స్వస్తి పలుకుతున్నారు. ఒకప్పుడు పనుల్లో వేలల్లో పాల్గొనే కూలీలు పదుల సంఖ్యకు చేరారు. ఇంతగా గ్రాఫ్ పడిపోవడానికి కారణం వేతనాలు సమయానికి ఇవ్వకపోవడమే.

పెండింగ్‌లో వేతనాలు

ఉపాధి కూలీలు నమ్ముకుని పనులకు వెళ్లితే కూటమి ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా కూలీల కడుపులు మాడుస్తోంది. ఒక వ్యక్తికి దినసరి కూలి సరాసరి రూ.200 వస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వాస్తవంగా రోజుకు ఒక వ్యక్తికి రూ.307 కూలి పడేలా అధికారులు పనులు చేయించాల్సి ఉంది. ఇక్కడి అధికారులు మాత్రం ఎవరూ ఆ దిశగా పనులు కల్పించకపోవడం గమనార్హం. ఇక వేతనాలు రెండున్నర నెలలుగా పడటం లేదు. ఒక్క నందవరం మండలంలో రూ.2.44 కోట్లు ఉపాధి వేతనాలను కూటమి సర్కార్ పెండింగ్ పెట్టింది. దీంతో ఉపాధి పనులపై కూలీలు ఆసక్తి చూపడం లేదు. అలాగే మండలంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్లాంటేషన్, మినీ గోకులాలు మేటీరియల్ పనులకు రూ.3.36 కోట్లు పేమెంట్ బకాయిలో ఉంది. వేతనాల కోసం కూలీలు ఎదురు చూపులు చూస్తున్నారు. కుటుంబాలు గడవక నానా అవస్థలు పడుతున్నారు.

అస్తవ్యస్తంగా నిర్వహణ

ఉపాధి పథకంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రాజకీయ రంగు పులిమి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి పనులకు బాధ్యత లేకుండా చేశారు. నందవరంలో ఏపీడీ విచారణ పేరుతో బలవంతంగా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేశారు. రాజకీయ ఒత్తిళ్లు మితిమీరడంతో అధికారులు సైతం తల ఊపుతున్నారు. ప్రస్తుతం మేటీలతో పనులు నెట్టుకొస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నియమించకపోయినా మేటీలకు ఆన్‌లైన్ ఎస్ఎంఎంఎస్ ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్త మవుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు లేకుండా చేస్తున్న పనులపై రేపటి రోజు సామాజిక తనిఖీకి చేపడితే అందులో జరిగిన అవినీతికి ఎవరిని బాధ్యులను చేస్తారో అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధి పనులలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో సీనియర్ మేట్ ద్వారా ఉపాధి పనులను కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో ఉపాధి కూలీలు పనికి రాకున్న మస్టర్లలో హాజరు వేస్తున్నారు. దీంతో పనికి వెళ్లిన ఉపాధి కూలీలు నష్టపోతున్నారు. ఉపాధి పనుల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు మాత్రం స్పందించడం లేదు.

త్వరలో జమ అవుతాయి



మండలంలో రెండున్నర నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు బకాయిలు ఉండడం వాస్తవమే. ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లిన వారికి త్వరలో వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దీంతో పాటు మేటీరియల్ పేమెంట్లు కూడా ప్రభుత్వం విడుదల చేసింది. అవి కూడా త్వరల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది.

– శ్రీనివాసులు, ఏపీఓ, నందవరం

ఇల్లు గడవడం కష్టమైంది



మేము కష్టం నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. మా కుటుంబంలో మేమి ఇద్దం (భార్య, భర్త) ఉపాధి పనులకు వెళ్లాం. 10 వారాలుగా వేతనాలు రాలేదు. ఇల్లు గడవడం కష్టంగా మారింది. ప్రభుత్వం ఉపాధి కూలీలపై చిన్నచూపు చూస్తోంది. వెంటనే నిధులు మంజూరు చేసి కూలీలు చెల్లించాలి. ఉపాధి కూలీలను ఆదుకోవాలి.

– లక్ష్మి, ఉపాధి కూలీ, నందవరం మండలం

కూలి డబ్బులు రాలేదు



వ్యవసాయ పనులు లేక ఉపాధి పనులపైనే ఆధారపడుతున్నాం. ఉపాధి పనులకు వస్తున్నా ప్రభుత్వం వేతనాలు వేయలేదు. 9 వారాలుగా మాకు కూలి డబ్బులు పడలేదు. కుటుంబం గడవటం కష్టంగా మారింది. ప్రభుత్వం ఇప్పటికైనా ఉపాధి కూలీలకు వేతనాలు మంజూరు చేయాలి.

– చిన్న మల్లికార్జున, ఉపాధి కూలీ, నందవరం

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసుకుందాం



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న అనుబంధ విభాగాల అధ్యక్షులు

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికై వైఎస్సార్‌సీపీ ప్రతి కార్యకర్త, నాయకుడు, మహిళలు తమవంతుగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఆదోని నియోజకవర్గ, మండల కమిటీలను మాజీ ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయా కమిటీలకు ఎన్నికైన వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

ఆదోని మండల అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఎంపికైన వారు..

ఆదోని మండల యూత్ వింగ్ అధ్యక్షుడిగా సోమేశ్వరరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గుమ్మల అంకిత, రైతు విభాగం కె.గర్జప్ప, బీసీ సెల్ బి.సోమలింగ, ఎస్సీ సెల్ కెంగారు నాగప్ప, ఎస్టీ సెల్ ఎరుకల మారేష్, మైనార్టీ సెల్ షేక్ సలాం, స్టూడెంట్ వింగ్ మాదిగ ఉచ్చీరప్ప, పంచాయతీ రాజ్ వింగ్ లేమనె నాగరాజు అలియాస్ మీసేవ నాగరాజు, ఆర్‌టీఐ వింగ్ బింగి పూజారి వీరేష్, వలంటీర్స్ వింగ్ గంధాల ప్రణయ్‌కుమార్, గ్రీవెన్స్ సెల్ కె.హుల్తెప్ప, సోషల్ మీడియా సన్నకోల విజయరాజ్, వైఎస్సార్‌టీయూసీ గంధాల వినోద్‌కుమార్, ఇంటెలెక్చువల్స్ ఫోరం ఎస్.హనుమంతు, బూత్ కమిటీస్ వింగ్ మెడికల్ నాగరాజు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా సూరిపోగు ప్రతాప్‌లను నియమించారు.

వైఎస్సార్‌సీపీ ఆదోని మండల కమిటీ..

వైఎస్సార్‌సీపీ ఆదోని మండల కమిటీ వైస్ ఉపాధ్యక్షులుగా కావసి శివరాజ్, కె.పి.గిడ్డయ్య, జనరల్ సెక్రటరీలుగా చిన్నారెడ్డి, మల్లారెడ్డి, బళ్లారి రాముడు, తలారి శేఖర్, సెక్రటరీలుగా క్రిష్టప్ప, మదిరె శ్రీనివాసులు, ఈ.వి.శివ, ఎం.ఈరన్నగౌడ్, ఈరప్ప, ట్రెజరర్‌గా షోకన్న, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నరసింహులు, బోయ కొండ, భూమన్న, రామాంజిని కొత్తూరు, నాగరాజు, బాలస్వామి, బోయ భీమన్న, మారెన్న, ఈరన్న, గోవిందరాజులు, బి.టి.రమేష్‌లను నియమించారు. ఎంపికైన వారు తమ సేవలను గుర్తించినందుకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక



పార్టీ రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ప్రజల కోసం పనిచేద్దాం

- పార్టీని మరింత బలోపేతం చేసుకుందాం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక
- వైఎస్సార్‌సీపీ యూత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి ఘన సన్మానం

ఎమ్మిగనూరుటౌన్: అందరూ ఐక్యంగా ప్రజల కోసం పని చేద్దామని, నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసుకొని వచ్చే ఎన్నికల్లో గెలిపించుకొని జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమైన బుట్టా ప్రతూల్‌కు ఆదివారం పట్టణంలోని ఎంజీ మెమోరియల్ హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ క్రేన్‌తో గజమాల వేసి సత్కరించగా నియోజకవర్గంలోని గ్రామాల నుంచి వందల సంఖ్యలో తరలి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలే ముఖ్యమని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారన్నారు. తన కుమారుడికి రాష్ట్ర యూత్ ఉపాధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. తాను ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో వుండి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

యువకులు ముందుకు రావాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి యువత ముఖ్యమని, యువకులు ముందుకు రావాల్సిన అవసరం వుందని రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా నియామకమైన బుట్టా ప్రతుల్ అన్నారు. తనకు రాష్ట్ర స్థాయిలో పదవి ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చి మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకునేందుకు యువతలో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎద్దుల శివారెడ్డి, రాష్ట్ర నాయకులు బుట్టాశివనీలకంఠ మాట్లాడారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతరెడ్డి, గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి, మాచాని వెంకటేష్, విరూపాక్షిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు నజీర్‌అహమ్మద్, దివ్యకళ, పార్టీ మండల అధ్యక్షులు కేవీ కృష్ణారెడ్డి, శివప్పగౌడ్, జిల్లా నాయకులు ఎంకే శివప్రసాద్, యూకే రాజశేఖర్, సునీల్ కుమార్, బందెనవాజ్, మురళీనాయుడు, పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కామర్తి నాగేషప్ప, కోటకొండ నరసింహులు, పాలశ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్‌రమేష్, కె.విశ్వనాథ్, పేట శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, లక్ష్మన్న మాబ్బాషా, అంజి, రామకోటిరెడ్డి, మన్సూర్, భాస్కర్‌రెడ్డి, లతారెడ్డి, షబ్బీర్ అహమ్మద్, అల్తాఫ్, సోమేష్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

రూ.4.50 లక్షల విరాళం

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి భక్తుడు ముంబాయికి చెందిన ప్రశాంత్ కృష్ణపూర్ శ్రీమఠంలో జరుగు దైనందిక పూజలకు గానూ రూ.4.50 లక్షలు విరాళంగా అందజేసినట్లు మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. రాఘవేంద్రస్వామి దర్శనానంతరం విరాళం అప్పగించారు. ఈ సందర్భంగా దాత, కుటుంబ సభ్యులను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, రాఘవేంద్రుల జ్ఞాపికతో ఆశీర్వదించారు.

మహానందరెడ్డి సేవలు మరువలేనివి

ఆదోని రూరల్: కార్మిక ప్రజా పోరాటాల నాయకుడు మహానందరెడ్డి సేవలు మరువలేనివని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మహానందరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు అశోక్ నందరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, సీపీఐ జిలా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంలో సినారెది ప్రత్యేక శైలి

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్య రచనలో సినారెది ప్రత్యేక శైలి అని వక్తలు అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సినారె వర్ధంతితో పాటు సంగీత విభావరి నిర్వహించారు. సినారె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. సినారె రాసిన తెలుగు సినిమా పాటలు విశేష ప్రజాధారణ పొందాయన్నారు. ఆయన విశ్వంభర రచనకు జ్ఞానపీఠ్ అవార్డు లభించిందన్నారు. పద్మశ్రీ, పద్మ విభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వంటి ఎన్నో అవార్డులు పొందారన్నారు. సుమారు 3 వేలకు పైగా పాటలు రచించారన్నారు. కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, గాయకులు సుధారాణి, బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసులు సినారె రచించిన పాటలను పాడి అలరించారు. కళాక్షేత్రం ఉపాధ్యక్షుడు సీవీ రెడ్డి, ఇనాయతుల్లా, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు స్వామి వారికి సుప్రభాతసేవ,అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సంతర్పణ చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు స్వామివారి మెట్లకు బండారు పూయడం, పొర్లుదండాలు, మెట్టు మెట్టుకు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

20న పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం

ఆలూరు: పట్టణ సమీపంలో గుంతకల్లు రోడ్డు పక్కన నూతనంగా రూ.8 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని ఈ నెల 20వ తేదీన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు, ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి ప్రారంభిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నపురెడ్డి ఆదివారం తెలిపారు.

కూలేందుకు సిద్ధం!

నందవరం : మండలంలోని ఇబ్రహీంపురం గ్రామంలో 22 ఏళ్ల క్రితం నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంకు ఇది. గ్రామంలో 3 వేల మందికి ఈ ట్యాంకు నీరే దిక్కు. ఏళ్ల క్రితం నిర్మించడంతో ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఈ ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో నీటి సరఫరా నిలిపి వేశారు. తరచూ పెచ్చులూడగా గ్రామస్తులు ప్రమాదం నుంచి తప్పించుకున్న సందర్భాలు ఉన్నాయి. మంత్రాలయం నెదర్లాండ్ నీటి పథకం అనుసంధానంగా ట్యాంకు నిర్మాణం చేపట్టారు. నేడో రేపో అన్నట్లు ట్యాంకు నిలబడింది. దీని చుట్టూ నివాసముంటున్న ప్రజలు ట్యాంకు దుస్థితి చూసి ఆందోళన చెందుతున్నారు. ట్యాంకు కూలితే ఏ ప్రమాదం సంభవించునోనని బేంబేలెత్తుతున్నారు. అధికారులు మాత్రం ట్యాంకు మన్నికపై దృష్టి సారించడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోని వైనం. శిథిలావస్థకు చేరిన ట్యాంకును తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పెచ్చులూడి శిథిలావస్థకు చేరిన నీళ్ల ట్యాంకు

50 శాతం ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఆదోని సెంట్రల్: ఇటీవల బదిలీలు పొందిన ఎస్జీటీ ఉపాధ్యాయుల్లో 50 శాతం మందిని రిలీవ్ చేయాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు ఎంఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.సి.సుంకన్న, జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ వెంటనే బదిలీలు పొందిన ఎస్జీటీ ఉపాధ్యాయులను బదిలీ పొందిన పాఠశాలకు పంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఆదోని మండల అధ్యక్షులు చింతకుంట రామకృష్ణ, సీనియర్ నాయకులు సూర్యుడు, దాసన్న, బాలాజీనాయక్, రాజేష్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు ఈకేవైసీ తప్పనిసరి

గోనెగండ్ల : అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ-కేవైసీ చేయించుకోవడానికి రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు, ఎంపీఈఓలను సంప్రదించి పూర్తి చేసుకోవాలన్నారు. ఓటీపీ ద్వారా నమోదు చేసే అవకాశం లేదు కాబట్టి రైతులందరూ ఈనెల 20వ తేదీ లోపు రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రేమ్ రాజ్ (ఫైల్)

గోనెగండ్ల: మండలంలోని పెద్దనేలటూర్ గ్రామ రోడ్డు సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గంజిహళ్లి గ్రామానికి చెందిన కిలోల్ల ప్రేమ్ రాజ్(25) అనే యువకుడు మృతిచెందినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపాడు. సీఐ తెలిపిన వివరాల మేరకు గంజిహళ్లి గ్రామానికి చెందిన కె. నాగన్న, భాగ్యమ్మ అనే దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాగన్న చిన్న కుమారుడు ప్రేమ్ రాజ్, వరుసకు అల్లుడైన మోహన్‌తో కలిసి పెద్దనేలటూర్ గ్రామంలో ఓ వ్యక్తి దగ్గర డబ్బులు తీసుకునేందుకు శనివారం రాత్రి బైకుపై వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా పెద్దనేలటూర్ గ్రామ రోడ్డులో మలుపు వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న గుంతలో పడిపోయారు. ప్రేమ్‌రాజ్ రాయిపై పడడంతో తలకు తీవ్రగాయమైంది. మోహన్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. మోహన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ప్రేమ్ రాజ్‌ను కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం ఉదయం మృతిచెందినట్లు సీఐ చెప్పారు. మృతుడి తల్లి భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మంత్రాలయం రూరల్ : ప్రభుత్వం ఎస్టీల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ ఈడీ తులసీదేవి అన్నారు. ఆదివారం పరమాన్‌దొడ్డి గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ 15 రోజుల పాటు గ్రామంలో ప్రత్యేక కాంపెయినింగ్ ఉంటుందన్నారు. ఎస్టీలకు రేషన్‌కార్డులు, పక్కా ఇండ్లు, సీసీ రోడ్లు, విద్యుత్, కిసాన్‌కార్డులు, ఆయుష్మాన్ కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో నూర్జహాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు.. పట్టుబడిన నిందితులు

పెద్దకడబూరు : మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో ఆదివారం గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి నిందితులను పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు హెచ్.మురవణి గ్రామానికి చెందిన దేవదానముతో పాటు హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసరావు, దుర్గా వెంకటప్రభాకర్, స్వామీజి బాలరెడ్డి, గద్వాల జిల్లాకు చెందిన కృష్ణ గ్రామంలోని చెత్త సంపద కేంద్రం వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే సిబ్బందితో వెళ్లి వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

విత్తనశుద్ధి.. పైరు వృద్ధి

- చీడపీడలు, తెగుళ్ల నివారణ సాధ్యం
- తక్కువ ఖర్చుతో పంటకు రక్షణ
- జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు



వేరుశనగ విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది(ఫైల్)

గోనెగండ్ల: ఏ పంట అయినా సాగు చేయడానికి నాణ్యమైన విత్తనాలు ముఖ్యం. అలాగే పంటల సాగులో విత్తనశుద్ధి కీలకం. అలాగే మరింత శ్రద్ధ వహించి విత్తనశుద్ధి చేసి విత్తితే మంచి దిగుబడులు పొందవచ్చు. అయితే చాలాలా మంది రైతులు విత్తన శుద్ధి గురించి పెద్దగా పట్టించుకోరు. తగిన జాగ్రత్తలతో విత్తనశుద్ధి చేసి, చీడపీడలు, తెగుళ్లను నివారించగలిగితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ దిశగా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించడానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వేరుశనగ సాగుకు ముందు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. విత్తనశుద్ధి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.

వేరుశనగ విత్తనశుద్ధి ఇలా..

- ఒక కేజీ వేరుశనగ విత్తనానికి 3 గ్రాముల బావిస్టన్ లేక ఎం.45లేదా సాఫ్‌పాడి కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఫలితంగా మొలకలు బాగా పెరిగి తెగుళ్ల రాకుండా నివారించవచ్చు.
- విత్తనశుద్ధి వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో మాత్రమే చేపట్టాలి. మోతాదు మించితే విత్తనం మొలకెత్తక నాశనం అవుతుంది.
- విత్తన సాగు తర్వాత 25 నుంచి 35 రోజులలోపు ఆకుపచ్చ తెగులు సోకకుండా కాంటప్ మందును స్ప్రే చేయాలి.
- 90 రోజుల తర్వాత బావిస్టన్‌ను స్ప్రే చేస్తే ఆకు బలంగా దృఢంగా ఏర్పడి మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.
- విత్తనశుద్ధి చేసేటప్పుడు రైతులు ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజ్‌లు విధిగా వినియోగించాలి.

విత్తనశుద్ధి విధిగా చేయండి



రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి, అధిక దిగుబడులు సాధించాలి. పంట సాగుకు ముందు విత్తనశుద్ధి ఎంతో ఉపయోగకరం. ఏ పంటకైనా మోతాదుకు మించి ఎరువులు, మందులు వాడకూడదు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి. అధికారులు సాగులో ఇచ్చే సలహాలు సూచనలు పొందండి. విత్తనశుద్ధి విధిగా చేయండి. తద్వారా అధిక దిగుబడులు పొందండని రైతులకు సూచించారు.

–మహమ్మద్ ఖాద్రీ, వ్యవసాయ సంచాలకుడు, ఎమ్మిగనూరు